క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సెప్టెంబర్ 5న విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఛలో తిరుపతిని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఛలో తిరుపతికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ బిల్ ఏజెన్సీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో నాయకులు నూర్ బాషా, కడప డివిజన్ నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, దేవదానం, నందీశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు నాయకులు రియాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థినిలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ కృష్ణ సాయి ప్రసాద్ తెలిపారు. గురువారం నగరంలోని మున్సిపల్ హైస్కూలులో ఆరోగ్య విద్యాధికారి ప్రసన్న లత ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థినిలకు రక్తహీనత అధికంగా ఉంటుందని, దానివల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ముఖ్యంగా విటమిన్లు, ప్రొటీన్లు కలిగిన పోషకాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి వైద్యులు డాక్టర్ శ్రీకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు కవిత సునంద, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, ఏఎన్ఎం శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


యశోద ఆస్పత్రిలో కిడ్నీకి అరుదైన ఆపరేషన్



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ సూర్యప్రకాశ్ వద్ది

కడప రూరల్ : యశోద ఆస్పత్రిలో కుడివైపు గల కిడ్నీకి అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు ఆ ఆస్పత్రి యురాలజిస్టు డాక్టర్ సూర్యప్రకాశ్ వద్ది తెలిపారు. గురువారం స్థానిక యశోద ఆస్పత్రి కేర్ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప నగరానికి చెందిన కూరగాయల వ్యాపారి 60 ఏళ్ల షేక్ రంతుబాష విపరీతమైన నడుమునొప్పి, మూత్రంలో రక్తం కారడం తదితర సమస్యలతో బాధపడేవారన్నారు. కొంతమంది సూచనల మేరకు ఆయన హైదరాబాదు సోమాజిగూడలోగల యశోద ఆస్పత్రికి వచ్చారన్నారు. ఆయనకు పరీక్షలు నిర్వహించగా, కుడివైపుగల కిడ్నీలో ట్యూమర్ ఉన్నట్లుగా గుర్తించామన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఆరు గంటలపాటు శ్రమించి సర్జరీ ద్వారా ట్యూమర్‌ను తొలగించామన్నారు. తమ ఆస్పత్రిలో యురాలజీకి సంబంధించి అత్యాధునిక వైద్య సదుపాయాలు కలవన్నారు. అలాగే అత్యాధునిక రొబో సౌకర్యం కూడా కలదన్నారు. బాధితుడు షేక్ రంతుబాష మాట్లాడుతూ ఇప్పుడు తాను అందరిలా ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆస్పత్రి ఏజీఎం ఆంజనేయులు, డిప్యూటీ మేనేజర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అవసరం



కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు

కడప అగ్రికల్చర్: స్థిరమైన వ్యవసాయాన్ని సాధించడానికి మొక్కలను పెంచడం ఎంతో ముఖ్యమని కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారన్నారు. అందులో భాగంగానే గురువారం ఊటుకూరు కేవీకేలో కోఆర్డినేటర్ వీరయ్య ఆధ్వర్యంలో ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం



వైవీయూలో జాతీయ క్రీడాదినోత్సవంలో వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగివేమన విశ్వవిద్యాలయం వ్యాయామవిద్య, క్రీడాశాస్త్రశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలకు వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి విచ్చేసి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా దేశానికి, క్రీడారంగానికి మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పాలెం రమాదేవి, వ్యాయామశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం, ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, ఫిజికల్ డైరెక్టర్ మదన్‌మోహన్ క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య ఆధ్వర్యంలో కేడెట్స్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డా. ఆర్. మహేష్, ఎన్‌సీసీ సుబేదార్ మాలిక్, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో..

కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగుభాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, హెచ్‌ఎం రహమతుల్లా పూలమాల వేసి నివాళులర్పించారు.



ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్లతో విద్యార్థినులు



క్రీడా ర్యాలీలో పాల్గొన్న ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్

మను పాలిటెక్నిక్‌లో..

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్‌లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, కోచ్‌లు కళ్యాణ్, అమృత్‌లు మాట్లాడుతూ చురుకైన, ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించుకోవడానికి, ఫిట్‌నెస్, ఆరోగ్యం కోసం ప్రతిరోజు కనీసం 30 నిమిషాలపాటైనా వ్యాయామం చేయాలన్నారు. అనంతరం ఫిట్ ఇండియా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు కళ్యాణ్,అమృత్ రాజ్‌లు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ విలయత్ అలి బైగ్, కోఆర్డినేటర్స్ మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ వెంకట్రామిరెడ్డి అన్నారు. కడప అంగడివీధిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు గుమ్మల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎస్‌జీఎస్‌వై అండర్ -14 క్రికెట్‌లో రాష్ట్రస్థాయిలో ఆడి ప్రతిభ కనబరిచిన విద్యార్థి మోక్షజ్ఞగౌడ్‌ను ఎంఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ఆ పాఠశాల మాజీ హెచ్‌ఎం ఉప్పలూరు సుజాత సహకారంతో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయుడు అగ్గిరప్ప, ఉపాధ్యాయులు సుదర్శన్‌బాబు, జగన్, ఉపేంద్ర, మాధవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, కోచ్‌లు కళ్యాణ్, అమృత్



రాష్ట్రస్థాయి క్రికెట్‌లో ప్రతిభచాటిన మోక్షజ్ఞగౌడ్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

క్రీడాప్రతిభా పురస్కారాలు ప్రదానం



రాష్ట్ర, జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన మున్సిపల్ హైస్కూల్ మెయిన్ హెచ్‌ఎం నాగమణి, పీడీ వెంకటలక్ష్మికి పురస్కారం ప్రదానం చేస్తున్న జేసీ



ప్రొద్దుటూరు పీడీ రాఘవ



మైదుకూరు పీడీ చంద్రావతి, హెచ్‌ఎం



రామనపల్లె పీడీ రెడ్డయ్య, హెచ్‌ఎం



యర్రగుంట్ల పీడీ నాగార్జునయ్య , హెచ్‌ఎం

కడప స్పోర్ట్స్: జిల్లావ్యాప్తంగా 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాల క్రీడాసమాఖ్య (ఎస్‌జీఎఫ్) క్రీడాపోటీల్లో అత్యుత్తమ క్రీడాప్రతిభ కనబరిచిన పాఠశాలలకు క్రీడా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని గురువారం రాత్రి కడప నగరంలోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో క్రీడాప్రతిభా పురస్కారాలకు ఎంపికైన వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అతిది సింగ్ హెచ్‌ఎం, పీడీలను సత్కరించి పురస్కారాలను ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయిలో కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్ ప్రథమస్థానంలో నిలవడం పట్ల అభినందనలు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధా పురస్కారాలు పొందిన పాఠశాలల హెచ్‌ఎం, పీడీలను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి, ఏపీ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు బి. నిత్యప్రభాకర్, కె. రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు పొందిన పాఠశాలలు..

1వ స్థానం : మున్సిపల్ హైస్కూల్ మెయిన్, కడప
2వ స్థానం : డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూల్, ప్రొద్దుటూరు
3వ స్థానం : జెడ్పీ హైస్కూల్ (బాలురు), మైదుకూరు
4వ స్థానం : జెడ్పీ హైస్కూల్, రామనపల్లి, చెన్నూరు
5వ స్థానం : జెడ్పీ హైస్కూల్ (బాలురు), యర్రగుంట్ల.

తేనె కన్నా తీయనిది అమ్మ భాష

– వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: తేనె కన్నా తీయనైనది అమ్మ భాష అని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. గురువారం వైవీయూలో తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి అధ్యక్షతన ×తెలుగుభాషా దినోత్సవాన్ని₹ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి జరిగినట్లు సాంకేతికతను తెలుగుశాఖ అందిపుచ్చుకుని అభివృద్ధి దిశగా వెళుతుండడం సంతోషదాయకమన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. వైవీయూలో ఎటు చూసినా వేమన పద్యాలు, తెలుగు సూచికలు కనిపిస్తాయన్నారు. ప్రత్యేక న్యాయాధికారి పసుపులేటి శంకర్ మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగు భాష గొప్పదన్నారు. తెలుగు భాష చరిత్ర, సాహిత్యం మహోన్నతమైనదని కొనియాడారు. మరో అతిథి డా. అంకె శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు శాసనాలు, కైఫియత్తులు, చరిత్ర మర్చిపోయిన కవుల గురించి అవగాహన కల్పించారు. రాయలసీమ భాష, సాహిత్యం ఇతర ప్రాంతాలకు తీసిపోదని, దీనిపై మరింత పరిశోధన జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పాలెం రమాదేవి, తెలుగుశాఖ ఆచార్యులు తప్పెట రామప్రసాదరెడ్డి, ఎం.ఎం.వినోదిని, ఆర్ట్స్ విభాగ డీన్ ఆచార్య గంగయ్య, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, తెలుగుశాఖ అధ్యక్షులు డా. జి. వీరయ్య, ముఖ్యఅతిథి డాక్టర్ రాజీవ్ రమ్యలు తెలుగుభాష గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయంతి, కృష్ణవేణి, షాజియాబేగం, సుధారాణి, రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించారు. తొలుత బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సిబ్బంది గిడుగు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ పొదిలి నాగరాజు ×తెలుగు భాష ఔన్నత్యం₹ అనే అంశంపై మాట్లాడుతూ తెలుగుభాష శాతవాహనుల కాలం నుండి ప్రజలభాషగా వాడుకలో ఉందన్నారు. క్రీ.పూ. 575లో కడపజిల్లాలోని కలమల్లలో ఎరికల్ ముత్తురాజు ధనంజయుడు వేయించిన శాసనం తొలి తెలుగు గద్యశాసనమన్నారు. నన్నయ్యకు పూర్వం కూడా సర్వదేవుడు మొదలైన కవులు ఉన్నారని, వారు తమ కాలం నాటి వ్యవహారిక పదాలను కావ్యాల్లో ఉపయోగించారన్నారు. అందుకే గిడుగు వ్యవహారిక భాషోద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ విద్యార్థులు తెలుగును తప్పక చదివినపుడే భాషా సాహిత్యాల పట్ల మక్కువ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కవి కల్లూరు బాలయల్లారెడ్డి, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు తెలుగు భాష ఔన్నత్యం గురించి కవితలు వినిపించారు. పలువురు విద్యార్థులు కూడా మాట్లాడారు. చివరగా వక్త డాక్టర్ పొదిలి నాగరాజును ఆచార్య జి.పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్, హరికృష్ణ, సుమతి, అరుణ కలసి ఘనంగా సత్కరించారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం గిడుగు రామమూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్.. గిడుగు చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాదెండ్ల బాబ్జి, లైబ్రేరియన్ సుబ్రమణ్యం, సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



గిడుగు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

గిడుగు సేవలు అభినందనీయం

కడప ఎడ్యుకేషన్: తెలుగుభాష అభివృద్ధికి గిడుగు చేసిన సేవలు అభినందనీయం అని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు అన్నారు. గిడుగు జయంతిని గురువారం కడపలోని పెన్షనర్ల సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిడుగు పుట్టినరోజును తెలుగు భాషా దినోత్సవంగా జరుపు కుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నగేష్, జిల్లా పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడు శంకరయ్య, నారాయణ, మల్లయ్య, వెంకటసుబ్బయ్య, రాయుడు, నాగమల్లన్న, శ్రీనివాసులు, రాధాకృష్ణ మూర్తి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



అతిథిని సత్కరిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు



బ్రౌన్ కేంద్రంలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంచాలకులు పార్వతి, సిబ్బంది



కేంద్ర గ్రంథాలయ సంస్థలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

పీఎస్‌యూ కడప నగర కమిటీ ఎన్నిక

కడప ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ముందుండాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం కడప నగరంలోని కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభించి మూడు నెలలు అవుతున్నా నేటికీ జిల్లాలోని కడప, మైదుకూరు, పులివెందుల, పోరుమామిళ్లలోని గిరిజన రెసిడెన్సియల్ వసతి గృహాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందన్నారు. అనంతరం పీఎస్‌యూ కడప నగర నూతన కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. నగర అధ్యక్షులుగా అనిల్, కార్యదర్శిగా రాంచరణ్, సభ్యులుగా అశోక్, హర్ష, నరసింహ, యుగంధర్, కార్తీక్, అరవింద్, నాని, రాజు తదితరులను ఎన్నుకున్నారు.

పాత రిమ్స్ సమీపంలో చెత్తలో మంటలు

కడప అర్బన్: కడప నగరంలోని పాత రిమ్స్ సమీపంలో ఆల్‌పీ స్కూల్ వద్ద చెత్తకు గురువారం నిప్పు అంటుకుంది. దీంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్కూల్ ఉపాధ్యాయులు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక శాఖ వారు వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

మృత్యుంజయేశ్వరుడి హుండీ సొమ్ము లెక్కింపు



కడప కల్చరల్ : కడప నగరం మృత్యుంజయకుంటలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలోని హుండీల్లోని సొమ్మును గురువారం లెక్కించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. అర్చకు లు సతీష్ శశిధర్, దక్షిణామూర్తి, ఆలయ సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ లె క్కింపులో మే 24 నుంచి ఇప్పటివరకు మొత్తం రూ. 92,648 లభించిందని ఆలయ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కడప అర్బన్: కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో తిరుపతి– తాడిపత్రి బైపాస్ రోడ్‌లో బుధవారం అర్ధరాత్రి కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో కడప నగరం మరాఠీవీధికి చెందిన గరికంటి జగదీష్ (30) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. జగదీష్ కడప నగరంలోని విఘ్నేశ్వర సర్జికల్ అండ్ మెడికల్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతని స్నేహితుడు పృథ్వీరాజ్ ఇద్దరూ కలిసి తమ హోండా షైన్‌లో వెళుతుండగా కారును వెనుకవైపు నుంచి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మోటార్‌సైకిల్‌లో వెనుక కూర్చున్న జగదీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలియజేశారు.

బంగారు ఆభరణాలు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్



దొంగ అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న చిన్నచౌక్ సీఐ తేజమూర్తి

కడప అర్బన్: బంగారు ఆభరణాలను దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోలో వెళుతున్న మహిళను ఏమార్చి ఆమె కట్టెల సంచిలో వున్న బంగారు ఆభరణాలను దొంగతనం చేసిన ఆటో డ్రైవర్‌ను చిన్నచౌక్ సీఐ తేజమూర్తి, ఎస్ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి గురువారం అరెస్ట్ చేశారు. కడప నగరం సాయిపేటకు చెందిన షేక్ జాఫర్ వల్లీ ఈనెల 28న బాధిత మహిళ వద్ద నుంచి బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లాడు. అతనిపై నిఘా వుంచి గురువారం సాయంత్రం అరెస్ట్ చేసి బంగారు ఆభరణాలను రికవరీ చేశారు.

అగ్నిమాపకశాఖ ఎన్నికల్లో కడప సిబ్బంది ఎన్నిక

కడప అర్బన్: ఏపీ ఫైర్ సర్వీసెస్ అసోసియేషన్‌కు ఎన్నికలను గుంటూరులో ఈనెల 28న నిర్వహించారు. ఈ ఎన్నికలలో కడప జిల్లాకు చెందిన షేక్ నూర్ బాషా అసోసియేషన్‌లో క్రీడలు, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా, రవీంద్రారెడ్డి ఉపాధ్యక్షుడుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గెలుపునకు కారణమైన కడప జిల్లా అగ్నిమాపక సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.


ఘనంగా ఆరోగ్యమాత ఉత్సవాల పతాకావిష్కరణ

కడప కల్చరల్ : కడప వేలాంగణి ఆరోగ్యమాత ఉత్సవాలలో పాల్గొనడం ఆ తల్లి నాకు అనుగ్రహించిన వరమని కర్నూలు మేత్రాసన పీఠాధిపతి మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ గోరంట్ల జ్వానేష్ అన్నారు. గురువారం ఆరోగ్యమాత ఉత్సవాలను పతాక ఆవిష్కరణతో ప్రారంభించారు. అంతకుముందు ఆరోగ్యమాత పాఠశాల ఆవరణలో మరియ తల్లి మండపంలో ఉంచిన స్వరూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషప్ జ్వానేష్ మాట్లాడుతూ మరియ తల్లి అనుగ్రహ పరిపూర్ణురాలని, కడపలో కొలువైన ఆమె ప్రార్థించిన వారందరిపై అనుగ్రహం చూపుతోందన్నారు. మొదటిరోజున మరియ తల్లి తేరును ప్రత్యేకంగా అలంకరించి క్షేత్రం ప్రాంగణంలో విశ్వాసులు ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, వికర్ జనరల్ ఫాదర్ బాలరాజు, మరియాపురం మాసాపేట డాన్ బోస్కో పాస్టరల్ సెంటర్ చెన్నూరు ఖాజీపేట విచారణ గురువులు, ఆరోగ్యమాత, జేయంజె, క్రీస్తు జ్యోతి సిస్టర్స్, సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్, తిరుణాల కమిటీ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



ఉత్సవాల పతాకావిష్కరణ చేస్తున్న బిషప్ గోరంట్ల జ్వానేష్

వెయిట్‌లిఫ్టింగ్‌లో శివరామకృష్ణ సత్తా



కడప స్పోర్ట్స్ : కడప నగరం ఉక్కాయపల్లెకు చెందిన ఆదిబోయిన శివ రామకృష్ణయాదవ్ ఆలిండియా రైల్వేస్ నేషనల్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటాడు. ఈనెల 26న ముంబైలో నిర్వహించిన ఈ పోటీల్లో ఈయన పాల్గొని స్నాచ్ విభాగం 140 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 174 కేజీలతో మొత్తం మీద 314 కేజీల బరువు ఎత్తి రెండోస్థానంలో నిలిచాడు. మురళీకృష్ణయాదవ్, శ్రీవాణిల కుమారుడైన ఈయన స్పోర్ట్స్‌కోటాలో ప్రస్తుతం గుంటూరు రైల్వేస్‌లో టీసీగా పనిచేస్తున్నాడు. కాగా ఈయన కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో చదవడంతో పాటు శిక్షణ పొందారు. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పతకం సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

వైవీయూ ఇన్‌చార్జి వీసీపై మంత్రులకు ఫిర్యాదు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను తొలగించాలంటూ ఏఐవైఎఫ్ నాయకులు మంత్రులు, ఉన్నతవిద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఫిర్యాదు చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్, విద్యాశాఖ మంత్రి ఓఎస్‌డీ ఆకుల వెంకటరమణలను ఏఐవైఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, సహాయ కార్యదర్శి వి. గంగాసురేష్‌లు మాట్లాడుతూ ఆరోపణలు ఉన్న ఆచార్య కె. కృష్ణారెడ్డిని ఇన్‌చార్జి వీసీ పదవి నుంచి తప్పించాలని కోరారు.